క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం: స్థానిక టూ టౌన్ కొవ్వాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ లైన్లపై చెట్లు కొమ్మలు తొలగించడానికి శనివారం ఉదయం 6:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పట్టణంలో పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉండి బైపాస్ రోడ్, డీ–మార్ట్ ఏరియా, బీవీ రాజు సర్కిల్, విష్ణు ఇంజినీరింగ్ కాలేజ్ ఏరియా, దుర్గాపురం ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్దిరావమ్మ, గంగానమ్మ సంబరాలు ప్రారంభం



మాదివాడలోని మద్దిరావమ్మ, గంగానమ్మ సంబరాల్లో పాల్గొన్న పీవీఎల్

ఆకివీడు: మాదివాడలో వేంచేసియున్న మద్దిరావమ్మ, గంగానమ్మ సంబరాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉండి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ గ్రామ దేవతలుగా వెలుగొందుతున్న మద్దిరావమ్మ, గంగానమ్మ సంబరాలకు వందల ఏళ్ల చరిత్ర ఉందన్నారు. తరతరాలుగా ఈ ప్రాంత ప్రజలు ప్రతి ఏటా మద్దిరావమ్మ సంబరాలు, నాలుగేళ్లకొకసారి జాతర, జూన్ 1వ తేదీన ఆలయ పునర్నిర్మాణ వార్షికోత్సవాల్ని అంగరంగ వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అమ్మవారి ఆలయ పునరుద్ధరణతో మాదివాడ అభివృద్ధి రూపురేఖలు మారిపోయాయన్నారు. మాదివాడలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ముగ్గురు గెలుపొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధి మాసాబత్తుల రాఘవులు, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, కౌన్సిలర్లు మోటుపల్లి కుమారి, నిమ్మల నాగు, పార్టీ సమన్వయ కమిటీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, అంబటి రమేష్ పలువురు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు ముందే వచ్చిన మామిడి



సీసలి వద్ద రాష్ట్రీయ రహదారి పక్కన మామిడి పండ్లు అమ్ముతున్న దృశ్యం

కాళ్ల: మామిడి పండ్లు ఈ ఏడాది సీజన్ కంటే ముందే వచ్చేశాయి. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో మామిడి పండ్ల సీజన్ మొదలవుతుంది. కానీ మార్చిలోనే మామిడి పండ్లు మార్కెట్‌కు రాగా, ధరలు వినియోగదారులకు చుక్కలు చూపుతున్నాయి. కాళ్ల మండలం సీసలి గ్రామం వద్ద రాష్ట్రీయ రహదారిని ఆనుకుని మామిడి పండ్ల దుకాణం వెలిసింది. చెరుకు రసాలు, నూజివీడు చిన్నరసాల రకాలు ఇక్కడ విక్రయిస్తున్నారు. చెరుకు రసాలు రకం పరక రూ.400 నుంచి రూ.500 వరకు, నూజివీడు చిన్నరసాలు రూ.500 నుంచి రూ.600 వరకు విక్రయిస్తున్నారు. నూజివీడు తోటల్లోనుంచి మామిడి పండ్లను దిగుమతి చేసుకున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. సీజన్ ప్రారంభంలో అధిక రేట్లకు సరుకు కొనాల్సి వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు.

వైభవంగా సంకటహర చతుర్థి పూజలు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా లక్ష్మీగణపతి హోమం జరిపించారు. శుక్రవారం ఆలయంలో భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో 15 మంది దంపతులు హోమంలో పాల్గొన్నారు. హోమం అనంతరం భక్తులకు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈఓ యాళ్ల సూర్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా దానమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ

పెనుమంట్ర: సోమరాజు ఇల్లిందలపర్రులో నూతనంగా నిర్మించిన దానమ్మ ఆలయ విగ్రహ పునః ప్రతిష్ఠా కార్యక్రమం గ్రామానికి చెందిన దాత వెలగల నవభారత్ రెడ్డి, వాణి దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి గూడూరి ఉమాబాల దానమ్మ వారిని దర్శించుకున్నారు. అన్నసమారాధన చేశారు. ఆలయ నిర్మాణ ప్రధాన దాత వెలగల శివాజీరెడ్డి దంపతులు, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి దంపతులు, సర్పంచ్ వనుం సూర్యనారాయణ, ఉపసర్పంచ్ గొలుగూరి నాగిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కొవ్వూరి సూర్యభాస్కర రెడ్డి, కొవ్వూరి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



ఉండి పెదపేట చర్చిలో వాక్యోపదేశం చేస్తున్న పాస్టర్ ప్రసన్న



ఆకివీడులో శిలువ మోస్తున్న ఉండి వైఎస్సార్ సీపీ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు



ఉండి పెదపేట సెయింట్ పాల్స్ లూథరన్ గుడ్‌ఫ్రైడే వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు



బేతాని చర్చిలో ప్రత్యేక గీతాలను ఆలపిస్తున్న దృశ్యం



జువ్వలపాలెం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఆకివీడు: ప్రేమ, కరుణ, సృదయంతో జీవించడమే క్రీస్తు మార్గమని వైఎస్సార్ సీపీ ఉండి అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా ఆకివీడు ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో శిలువ యాత్రను శుక్రవారం స్థానిక వైఎస్సార్ సెంటర్ నుంచి అజ్జమూరు గరువులోని ఆర్సీఎం చర్చి వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై క్రైస్తవులతో కలిసి పీవీఎల్ శిలువను కొంత దూరం మోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభ శుక్రవారం 2 వేల సంవత్సరాలు క్రితం ఈ లోకానికి వచ్చి ఏసుప్రభు మానవాళి పాపం విమోచన కోసం తన అమూల్యమైన రక్తాన్ని శిలువపై చిందించి తన ప్రాణాన్ని అర్పించారని చెప్పారు. ఈ సందర్భంగా గుడ్‌ఫ్రైడే జరుపుకుంటున్న క్రైస్తవులకు పీవీఎల్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చర్చి పాదర్ మద్దాల విజయ్‌కుమార్, అంబటి రమేష్, పలువురు క్రైస్తవులు శిలువను మోసి ర్యాలీలో పాల్గొన్నారు.

క్రీస్తు గీతాలాపన

ఉండి: గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని మండలంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పెదపేట సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చ్ పేరిష్ పాస్టర్ మానుకొండ ప్రసన్న ఆధ్వర్యంలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ దేవుడు మనిషిగా భూమిపైకి వచ్చిన రోజును క్రిస్మస్ పండుగగా ఆచరిస్తామని, మనిషిని పవిత్రుడుగా చేసిన రోజును గుడ్ ఫ్రైడే అంటామన్నారు. మనుషుల పాపాల కొరకు పవిత్రుడైన దేవుడు త్యాగం చేసి దుష్టుల చేతికి అప్పగించుకుని శిలువపై మరణించారన్నారు. శిలువ వేయబడిన అనంతరం ఏడు మాటలు మాట్లాడిన దేవుడు తన మరణ సమయంలోనూ ప్రపంచానికి అవసరమైన బోధనలు అందించారని అన్నారు. అనంతరం శిలువపై ఏసుక్రీస్తు పలికిన ఏడు మాటలపై చాబత్తుల చిరంజీవి, సిస్టర్ దాసరి కాంతమ్మ, కూనా రవి, చిట్టూరి హెన్రీటా, చిట్టూరి దెబోరా, చిట్టూరి మేరీనక్షత్రం, ఉండ్రు అబ్రహం ప్రసంగించారు. పాస్టర్ సుధీర్, సంఘ సీఆర్ రవీ ఆధ్వర్యంలో యండగండిలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో ఏడు మాటలను సీహెచ్ రవి, సీహెచ్ శాంతకుమారి, సుధారాణి, ఎం శాంతరత్నం, బీ రేఖ,వీ కరుణ,వీ సుధీర్ వివరించారు. ఆయా కార్యక్రమాల్లో చర్చి ప్రతినిధులు, సంఘ పెద్దలు, పీసీసీ సభ్యులు,యూత్, స్త్రీల సమాజం తదితరులు పాల్గొన్నారు.

చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

భీమవరం (ప్రకాశం చౌక్): గుడ్ ఫ్రైడేను భీమవరంలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసు క్రీస్తు భూమి మీదకు రావాలని లోక రక్షకుడుగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుడ్‌ఫ్రైడే ప్రాముఖ్యతను పాస్టర్లు విశ్వాసులకు వివరించారు. అలాగే ప్రభు సందేశాన్ని వివరించారు. పెద్ద సంఖ్యలో విశ్వాసులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. యువత ప్రత్యేక గీతాలను ఆలపించారు.

భక్తిశ్రద్ధలతో శుభ శుక్రవారం

కాళ్ల: ప్రపంచ మానవాళి పాప పరిహారార్థం ఏసుక్రీస్తు చేసిన శిలువ త్యాగాన్ని స్మరించుకుంటూ క్రైస్తవులు అంతా గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని జరుపుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఏసుక్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటలను ఆయా సంఘాల పాస్టర్లు, విశ్వాసులు విశదీకరించారు. బైబిల్ ప్రకారం లేఖనాల నెరవేర్పు, శిలువ త్యాగం, పాపుల రక్షణ వంటి అంశాలను వివరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లోని లూథరన్, ఆర్సీఎం, మన్నా, తదితర చర్చిల్లో గుడ్ ఫ్రైడే ధ్యాన ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

సీఎం వైఎస్ జగన్‌కే ప్రజల మద్దతు



చెరుకుమిల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఉండి అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు



చెరుకుమిల్లిలో గీత కార్మికుడ్ని ఓటు అభ్యర్థిస్తున్న పీవీఎల్ నర్సింహరాజు

- వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు
- చెరుకుమిల్లి గ్రామంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

ఆకివీడు: పేదల తలరాతల్ని మారుస్తూ సంక్షేమ పథకాలు అమలుజేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో శుక్రవారం గడపగడపకూ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పేదలు లక్షాధికారులవుతున్నారని చెప్పారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు పేద విద్యార్థుల ఉన్నత చదువులకు దోహదపడుతున్నాయన్నారు. రోడ్డు పక్క, చెరువు, కాల్వగట్లపై నివసించే పేద ప్రజలు పక్కా భవనాలు కట్టుకుని సొంత ఇంటి కల నెరవేర్చుకుంటున్నారని పీవీఎల్ చెప్పారు. చెరుకుమిల్లిలో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాల్ని ప్రారంభించుకుని పల్లెల్లోనే ప్రభుత్వ పాలనకు శ్రీకారం చుట్టామని చెప్పారు. పేదలు తమ అవసరాల కోసం మండల, జిల్లా కేంద్రాలకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా గ్రామ సచివాలయంలోనే సమస్యలు పరిష్కారం అవుతున్నాయని పీవీఎల్ చెప్పారు. ఇటువంటి ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకునే విధంగా ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి విజయం చేకూర్చాలని పీవీఎల్ కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను), త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు అంబటి రమేష్, సర్పంచ్ నందమూరి ప్రకాశం, ఉపసర్పంచ్ కూచంపూడి నర్సింహమూర్తి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు సైదాల సూర్యనారాయణమూర్తి, పార్టీ గ్రామ అధ్యక్షులు మంతెన సీతారామరాజు (సుఖీ), గ్రామ పెద్దలు దాట్ల బోసురాజు, మంతెన సునిల్‌కుమార్, అద్దంకి ప్రసాద్, ఎరిచర్ల సాంబర్లిన్, గ్లాడ్ సన్,కురెళ్ళ మాణిక్యాలరావు, వారా మోషేష్, సాల్మన్‌రాజు, నాయకులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాత దంపతులను సత్కరిస్తున్న ఆలయ అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక శ్రీ మావుళ్లమ్మ వారి సన్నిధిలో జరుగుతున్న శాశ్వత నిత్యాన్నదానానికి శుక్రవారం చినఅమిరం చెందిన కె. వెంకట సుబ్బరాజు శ్రీ దేవి దంపతులు రూ.1,11,116 విరాళంగా అందించారు. ముందుగా దాతలతో ఆలయ అర్చకులు కొప్పేశ్వరరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం ,అమ్మవారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో బుద్ధా మహాలక్ష్మి నగేష్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ

భీమవరం: స్థానిక టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రి వద్ద పార్క్‌చేసిన మోటారు సైకిల్ దొంగిలించారని పి.ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు టుటౌన్ ఎస్సై జీజే ప్రసాద్ చెప్పారు. గురువారం సాయంత్రం మోటారు సైకిల్ ఆసుపత్రి వద్ద రోడ్డుపై పార్క్ చేసి ఆసుపత్రిలోకి వెళ్లి వచ్చే సరికి గుర్తుతెలియన వ్యక్తి దొంగిలించాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

జగన్ పాలనలో సంతోషంగా క్రైస్తవులు



చెరుకువాడ సమావేశంలో పాల్గొన్న కొర్రపాటి అనిత, ఏఐసీఎఫ్, వైఎస్సార్ సీపీ నాయకులు

ఉండి: ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఓట్లు అడగడానికి మోసగాళ్లు వస్తున్నారని, క్రైస్తవులంతా జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కొర్రపాటి అనిత అన్నారు. శుక్రవారం మండలంలోని చెరుకువాడలో అనిత ఆధ్వర్యంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్), వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అనిత, ఏఐసీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొబ్బనపల్లి సుందర్‌దాస్, యండగండి సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జీ సుందర్‌కుమార్, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపల్లి టోనీ తదితరులు మాట్లాడుతూ గత కొద్ది రోజుల నుంచి క్రైస్తవ సంఘ నాయకులు అని చెప్పుకుంటున్న టీడీపీకి చెందిన వారు వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ వంటి సంస్థలపై ఇష్టానుసారం నోరు పారేసుకుంటున్నారని అన్నారు. అటువంటి వారిని గుర్తించి దూరంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో వీధి వీధికి క్రైస్తవులపై దాడులు జరుగుతున్నాయని చెప్పడం వారి నీచబుద్ధికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ఎక్కడా క్రైస్తవులపై దాడులు జరగడం లేదని, ఒకవేళ ఎక్కడైనా జరిగితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో దోషులకు శిక్షపడేలా చేస్తున్నారని అన్నారు. వైఎస్ జగన్ పాలనలో క్రైస్తవులంతా సుఖసంతోషాలతో జీవిస్తున్నారని అన్నారు. క్రైస్తవులకు ప్రత్యేక స్థానం కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డికి క్రైస్తవ లోకం రుణపడి ఉంటుందన్నారు. రాజకీయంగా, సామాజికంగా ముందుకు నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనుకనే తామంతా ఉంటామన్నారు. ఏఐసీఎఫ్ జిల్లా కో–ఆర్డినేటర్ పీతల రాజు, ఆకుల బిల్‌మోరియా, బొడ్డు వీరాస్వామి, ముడితి జోసఫ్, జంగంపల్లి తాతయ్య, డొల్లా సంపతరావు, కంకిపాటి తాతయ్య, కంకిపాటి విజయ్, డొల్లా యోసేబు, కొర్రపాటి మేరీలీలారత్నకుమారి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి మద్దతుగా బీసీ సంఘాల ప్రచారం



భీమవరంలో ఉమాబాలను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న వెంకటరమణ తదితరులు

భీమవరం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి బీసీ సంఘాల తరుపున విస్తృతంగా ప్రచారం చేస్తామని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నౌండ్రు వెంకటరమణ అన్నారు. భీమవరం నరసాపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గూడూరు ఉమాబాలను క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా మాట్లాడారు. నరసాపురం ఎంపీగా ఉమాబాలను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను విజయపథంలో నడిపిస్తాయని వెంకటరమణ స్పష్టం చేశారు. ముందుగా ఉమాబాలకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బాలం సత్యనారాయణ, జిల్లా బీసీ సంఘ అధ్యక్షుడు, సూరవరపు వెంకటాచార్యులు, గంటా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలంతా వైఎస్సార్ సీపీ వెంటే



పెద అమిరంలో పీవీఎల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న నౌడు

కాళ్ల: నియోజకవర్గంలో బీసీలంతా వైఎస్సార్ సీపీ, ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు వెంట ఉన్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నౌడు వెంకటరమణ స్పష్టం చేశారు. కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలోని పార్టీ కార్యాలయంలో పీవీఎల్‌ను నౌడు వెంకటరమణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నౌడు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీసీ సంఘాల తరపున విస్తృత ప్రచారం చేసి పీవీఎల్ నర్సింహరాజును అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. బీసీలకు పెద్దపీట వేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంటే బీసీలంతా ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి వస్తేనే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి బాలం సత్యనారయణ, జిల్లా బీసీ సంఘ అధ్యక్షులు సూరవరపు వెంకటాచార్యులు, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి గంటా సత్యనారాయణ, ఆకివీడు జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకటరాజు, రాజేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పీవీఎల్‌ను సత్కరించిన ముస్లిం పెద్దలు



పీవీఎల్‌ను సత్కరిస్తున్న ముస్లిం పెద్దలు

ఆకివీడు: పవిత్ర రంజాన్ మాసం ముస్లింలకు అత్యంత ప్రీతిపాత్రమైందని, పెద్ద పండుగగా భావిస్తుంటారని, ఆధ్యాత్మికతకు రంజాన్ పెట్టింది పేరు అని వైఎస్సార్ సీపీ ఉండి అసెంబ్లీ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. స్థానిక దుంపగడప రోడ్డులోని చిన్న మసీదు వద్ద వైఎస్సార్ సీపీ నాయకుడు ఎస్కే సుభానీ రంజాన్ విందును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన్ని ముస్లిం పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ముస్లింలు వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారని చెప్పారు. సీఎం జగన్ కూడా ముస్లింలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ఎండీ మదనీ, మస్తాన్ వలీ, సుఫీ ఖాదరీ, బాషిద్, మిజామ్ బాబా, ఎస్కే సుభానీ, హుస్సేన్, ఎం డీ.అలీ, షరీఫ్, వసీమ్, మునీర్, ఫయాజ్, ఎస్కే. ఆరీఫ్, రషీద్, అమీర్, జి ధనరాజు, పడాల శ్రీనివాసరెడ్డి, కిషోర్ రెడ్డి, సిరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రహదారి నిర్మించారని సర్పంచ్‌కు సత్కారం



సర్పంచ్ సత్యనారాయణను సత్కరిస్తున్న పెద్దలు

కాళ్ల: ఎన్నో ఏళ్లుగా నోచుకోని రహదారి నిర్మాణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాధ్యమైందని బొండాడ పేట గ్రామవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బొండాడపేట గ్రామంలో 200 మీటర్ల మేర రహదారిని గ్రామ సర్పంచ్ గోళ్ళ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇటీవల నిర్మించారు. ప్రధానంగా ఈ దారికి ఇరువైపులా పద్మశాలీలు నివాసం ఉంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే రహదారి నిర్మాణం జరిగిందని, దీంతో రహదారి సమస్య తీరిందని స్థానికులు, పెద్దలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా విజయగణపతి దేవస్థానంలో సర్పంచ్ గోళ్ళ సత్యనారాయణను ఆ ప్రాంత పద్మశాలీలు శుక్రవారం ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆకురాతి ఉమామహేశ్వరావు, ఆకురాతి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ గుత్తికొండ భూషయ్య తదితరులు సర్పంచ్ సత్యనారాయణను సన్మానించి బంగారు ఉంగరాన్ని ఉంగరాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలతో పాటు స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

నేడు పెద్దింట్లమ్మ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం

పెనుగొండ: మల్లప్పదిబ్బలోని పెద్దింట్లమ్మ ఆలయం పునఃప్రతిష్ఠ మహోత్సవం శనివారం నిర్వహించనున్నారు. గతంలో రహదారి విస్తరణతో ఆలయం రోడ్డు దిగువకు ఉండడంతో ఇబ్బందులు పడేవారు. వర్షం పడితే నీరు అంతా ఆలయంలోకి చేరుకునేది. దీంతో ఎన్నో ఏళ్లుగా నూతన ఆలయ నిర్మాణానికి విజ్ఞప్తి చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. సమస్యను ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకువెళ్లడంతో ప్రభుత్వం నుంచి రూ.80 లక్షల నిధులు మంజూరు చేయించారు. దీంతో నిర్మాణం పూర్తి చేశారు. శనివారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించడానికి సన్నాహాలు పూర్తి చేశారు. ప్రభుత్వ నిధులకు తోడు, దాతల సహకారం తోడు కావడంతో ఆలయాన్ని పూర్తి హంగులతో తీర్చిదిద్దారు. ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజుకు పలువురు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించండి



చెరుకువాడలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ఉండి: శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలంతా సహకరించాలని ఎస్సై ఎం.లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చెరుకువాడలో కేంద్ర బలగాలతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ఎస్సై మాట్లాడుతూ మండలంలో సమస్యాత్మక గ్రామాల్లో, అవసరమైన ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఎన్నికల సంఘం కృషి చేస్తుందన్నారు. దీనికి తోడు ప్రజలంతా తమ సహకారం అందించాలన్నారు. ఎన్నికల సమయంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా ఉండేలా భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. రాజకీయ పార్టీలు, ప్రజలు స్వచ్ఛందంగా ఎన్నికల నిర్వహణకు తోడ్పడాలన్నారు. ఎన్నికల సమయంలో ఏ విధమైన కేసులు నమోదైనా వాటిని ఎలక్షన్ కేసులగానే పరిగణిస్తామన్నారు. దీనివల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ప్రజలు అనవసర విషయాల జోలికి పోకుండా శాంతియుతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలని ఎస్సై అన్నారు.